# గరీబీ హటావ్

నిజంగా, నలభై యేళ్ళు తన శరీరం మీదికి వచ్చిపడ్డాయంటే, ఆనందరావుకే ఆశ్చర్యంగావుంది. అప్పుడే నలభై యేళ్ళా అనుకున్నాడు, తనలోతాను. పొట్ట చెక్కలయేటట్టు నవ్వుకున్నాడు. 'ఆనందిరావ్ ! నవ్వు సామాన్యుడివి కాదోయ్' అని తన వీపు తాను తట్టుకున్నాడు.

'ఎక్కడ పెదపులివర్రు, ఎక్కడ హైదరాబాద్'. టాంక్ బండ్ మీది పచార్లు చేస్తూ, అట్టే ఆలోచించుకున్నాడు.

ముప్ఫయేళ్ళనాడు ఎప్పుడో ముక్తేశ్వరావు మాస్టారు చెప్పనే చెప్పాడు. 'ఒరేయ్ ఆనందం, నువ్వు గొప్పవాడివి అవుతావురా' అని. నిజమే, నిజమే ఆయన అన్నది. 'పువ్వు పుట్టగానే పరిమళిస్తుందని, నా సంగతి ఆయనకు అప్పుడే తెలిసింది...' తనలో తాను సణుక్కుంటున్నాడు.

'నాకు లెక్కలా అట్టేవచ్చేవికావు. ఆరోజుల్లో లెక్కల్లోమార్కులు రాకపోతే ఒట్టి దద్దమ్మ అని జమకట్టేశేవారు. జీవితంలో ఒక్కలెక్కలేనా

కావల్సింది... ఎన్నోవున్నాయి... నేను ఎస్సల్సీ ఠపీమని తప్పంగానే, యింకేముంది నా జీవితమే సమాప్తి అయిపోయిందనుకున్నారు, పిచ్చి వాళ్లు. నన్ను ఎద్దావా చేసినవాళ్ళందరూ యివ్వాళ్టిరోజున ఆడుక్కుతింటు న్నారు...' కొంచెం గట్టిగానే, పైకి వినిపించేలాగున అన్నాడు, ఆనంద రావు.

'పాపం' అనుకుంటున్నారు. పైకి మాత్రం 'మ్చ్' అనే శబ్దం విని పించింది. జాలిగా చూస్తూ, యిద్దరు సాయం విహారులు. ఆనందరావు గతుక్కుమన్నాడు. 'కొంపతీసి తనను పిచ్చివాడు అనుకుంటున్నారేమో' అని క్షణం భయపడ్డాడు. వాళ్ళ వాలకం చూసి, మైపాగల్ నహీ, అన్నాడు నవ్వుతూ, ధైర్యంగా. యువతీ యువకులు యిద్దరూ మరింత బిగ్గరగా నవ్వారు. ఆనందరావు తనలోతాను నవ్వుకుంటున్నట్టే, యితరులను చూసి కూడా బిగ్గరగా నవ్వకలడు. ఆ విషయం వాళ్ళకు తెలియ చేశాడు.

'ఇందులో వాళ్ళ తప్పేంలేదులే' అని సమాధానపడ్డాడు ఆనంద రావు. చప్పున ఖాళీబెంచి కనిపించగానే తాపీగా కూర్చున్నాడు. హుస్సేన్ సాగర్ పేరును సార్థకం చేసుకుంటోంది. అలలు ఉవ్వెత్తుగావస్తూ, అమాంతం ఒడ్డుకు కొట్టుకుని పగిలిపోతున్నాయి. తాను విశాఖపట్నంలో కాలేజీలో చదివే రోజులు యిట్టే గుర్తుకు వచ్చినాయి. సాయంత్రం పూట రోజు బీచ్ కివెళ్ళి, ఆ సముద్రపు అలల్ని చూస్తూ వుండేవాడు. అన్నట్టు రంగారావు ఎక్కడున్నాడో, ఏంచేస్తున్నాడో, ఓసారి అనకాపల్లిలో గామాలు కలిశాడు. ఏదో పెద్ద పొజిషన్‌లోనే వున్నట్టు చెప్పాడు. 'వాడి మొహం ఏం పెద్ద పొజిషన్‌లే' ఆనందరావు సంతృప్తిగా తలవూపు తున్నాడు.

'బఠానీలు కావాలాసార్...?'

ఆనందరావు ఉలిక్కిపడ్డాడు, ఆ కేక హఠాత్తుగా తన చెవుల్లోకి పోయేటప్పటికి.

'బ్రతుకుతెరువు అనేక రకాలు...'

'ఏమిటిసార్ అంటున్నారు...'

'నీమాట కాదుగాని, యివిగో పైసలు. యిచ్చిపో.' పదిపైసలు చేతిలో పెట్టాడు. అటు యిటు తప్పిచూశాడు. ఎరరూ పరిచయస్తులు కన బడలేదు. అమ్మయ్య అనుకున్నాడు.

'నేను నిజంగా, బి. కామ్. తప్పివుండకపోతే, అంటే అదే బాచ్ లో ప్యాసయితే ఈ పాటికి నే కూడా వర్మ మాదిరి కో-ఆపరేటివ్ డిపార్ట్ మెంట్ లో ఉద్యోగం వెలగబెడుతూ వుండేవాన్నన్న మాట ... అంతేగా. మొత్తం అన్నీ ప్లస్సులు చేసుకుంటే, 350, 400 మధ్య ఊగుతూవుండే వాన్ని. అదీ ఒక ఉద్యోగమే? అదీ ఒక బ్రతుకే? ... అయినా, నాకు ఒకచోట నౌకరీచేసే అదృష్టం లేదన్నదూట. 'అంటే అలాంటి దుర దృష్టవంతున్ని కాదన్నమాట ... అంతేగా? ...' ఆనందరావు, తన బుష్‌కోటు కాలర్ క్రింద, బలంగా పచ్చిపడ్డ ఒక పేపపురుగును, గట్టిగా ఎడంచేత్తో లాగేసి కిందకొట్టేశాడు. తలవిదిలించేశాడు.

'శారదకు యివన్నీ యేంతెలుస్తాయ్! నే చెపితే అర్థమూకాదు. మీ వారు యేంచేస్తూ వుంటారండీ అని యెవరైనా అడుగుతే యేంచెప్పమంటా రండీ అని నన్ను అడిగింది. నిజంగా ఆ ప్రశ్నలో కొంత తెలివి లేకపో లేదు. పైకి కనిపించదుగాని శారద, నేను అనుకున్నంత తెలివి తక్కువది కాదు. అంటే అమాయకురాలుకాదు. నేను యేమీ చెయ్యటంలేదని, గాలికి తిరుగుతున్నానని, యిన్నేళ్లొచ్చినా సంపాదన విషయం ఆలోచించనని మా అత్తయ్య అన్నమాటలు శారదకు కూడా బాగా వంటపట్టాయి. పాపం ఏం

చేస్తుంది నన్ను డైరెక్ట్‌గా అడగలేక డొంకతిరుగుడు ప్రశ్న వేసింది. ప్రజా సేవ చేస్తున్నారనిగాని, దేశసేవ చేస్తున్నారని గాని చెప్పటం ఆమెకు చేత కాదు. అందరికీ అర్థమయ్యేభాషలో, నిరుద్యోగి అని చెప్పటం ఆమెకు నామర్దా. ఛీ! నేను నిరుద్యోగినా నిజానికి! కేవలం ఆఫీసుల్లో టైపుకొట్టటం ఫైళ్ళమీద దస్కతు పెట్టటం, యివే ఉద్యోగపు లక్షణాలవుతే, నన్ను నిరుద్యోగినన్నా, నాకు బాధలేదు.

శారదకు అసలు అర్థంకాదు. ఆమెకు అర్థమయ్యేటట్లు యెట్లా చెప్పాలో నాకు అంత కంటె అర్థంకాదు. నాకు మతిపోతోంది. ఇంటగెలిచి రచ్చగెలవ మంటారు మనవాళ్లు. నేను ఊళ్ళన్నీ జయించివస్తానుగాని, తీరా యింటికివచ్చే టప్పటికి మోకాలులోతు ఊబిలో దిగినట్లు అయిపోతుంది నాపని. నిజమే. నలభై యేళ్ళ వయస్సొచ్చిన వాడికి, యిరవైయేళ్ళ పిల్లి లుంటం పెద్ద విశేషమా! అవును. ఎంతసేపటికి నలుగురి పిల్లల తండ్రి అయ్యాడుగాని బాధ్యత తెలుసుకోవటంలేదని ఆడిపోసుకోవటమేగాని, యే బాధ్యతా తెలుసుకోకపోతే, వాళ్ళకు చదువులు యెట్లాచెప్పిస్తున్నాను? సంసారం యెట్లా గడుపుతునా ను? ఎట్లా సంపాదిస్తున్నాను? ఎక్కడి నుండి డబ్బు తెస్తున్నా ను? ఈ ప్రశ్నలు బైట వాళ్ళకెందుకు? వాళ్లు తీర్చే వాళ్ళా తీర్చేవాళ్ళా? లోకం అన్న తర్వాత, నలుగురూ నాలుగు రకాలుగా అనుకుంటూ వుంటారు. అందిరికీ సమాధానాలు చెప్పే బాధ్యత మనం పెట్టుకోనక్కర్లేదు.

'శారదే అడుగుతుందే నన్ను, యింత డబ్బు మీ కెక్కడి నుంచి వచ్చిందండీ' అని. అవన్నీ నీ కెందుకులే అంటే వూరుకోదే. మనిషికి బుర్రవుండాలి. అదీ ప్రధానం. తర్వాత డబ్బు దానంతటదే వచ్చిపడు తుంది.

'ఆనందరావు, మీరు నా దగ్గర అప్పు తీసుకొనటమనేది, నేనొక గర్వకారణంగా భావిస్తున్నాను' అన్నాడు శ్రీనివాసన్ గారు.

ఎంత విశ్వాసం వుండకపోతే, ఆయనంటివాడు నన్ను యింత యిదిగా పొగడుతాడు ? నాకు వెనకాల ఆస్తి యేముందని ? ఆయన నాకు అప్పు యివ్వటం ఒక ప్రివిలేజ్‌గా అనుకున్నాడు. నా గొప్పతనం, నా వ్యక్తిత్వం, హోదా, ఆయన గ్రహించాడు. ఇతరులు తెలుసుకోకపోతే దానికి నేనా బాధ్యుణ్ని. ప్రతివాడి దగ్గరకు వెళ్ళి, నేను ఫలానావాణ్ని, నా గొప్పతనం నేను చెప్పుకుంటానా, ఇన్‌సల్ట్! ఎదురింటి రామారావు ఉద్యోగస్తుడేగా, వందవంద రూపాయలు కావాలంటే తల్లడిల్లి పోయాడు. ఇంట్లో వస్తువు తాకట్టు పెట్టుకుని డబ్బు తెచ్చుకున్నాడు. నా పరపతికి విలువ యింతా అని లెక్కేమన్నావుందా ! శారదకు ఎంత నూరిపోసినా అర్థం కాదు. ఒక వేళ అర్థం చేసుకుందామనుకున్నా మా అత్తయ్య వుందే, రంగమ్మగారు, ఆమెగారు, శారదను అర్థంచేసుకోనీదు. ఏముందీ, మీ ఆయన గొప్పతనం, అక్కడ యిక్కడ అప్పులు చెయ్యటమేగదా అంటూ యిట్టే తీసి పారేస్తుంది. పోనీ ఆ అప్పైనా, ఆమెగార్ని తీసుకురమ్మను. చిల్లిగవ్వ పుట్టదు. హామీలు యిప్పించి, వస్తువులు, తాకట్టుపెడితే అప్పుగా యిస్తారు. అదేనా, కాగితాలమీద స్టాంపుల మీద సంతకాలు పెట్టించుకుని. వీనుకుంటే ఏం లాభం. వాళ్ళకు అర్థంకాదు. వాళ్ళకు అర్థంకాకపోయినా మనకు వచ్చిన నష్టమేమీలేదు.

అమ్మాయికి పెళ్ళీడొచ్చిందని, సంబంధాలు చూడాలని శారద తాపత్రయం తండ్రిగా నా బాధ్యత నాకు తెలీదా ! ఒకళ్లచేత చెప్పించుకోవాలా ! ప్రతిదానికి సమయం రావాలి ! పెళ్ళనంగానే వేలతో పని. సంబంధం కుదరటం ఒకయెత్తు. తర్వాత పెళ్ళిచేయటం ఒక యెత్తు. ఆనందరావుగారి కూతురి పెళ్ళంటే, యెట్లా జరగాలి, ఎంత భారీ

యెత్తుగా జరగాలి ! ఎంత మందిని పిలవాలి ! ఏమేం చెయ్యాలి. ఇవన్నీ మాటలా! ఎంత ఆలోచించాలి. ప్రజాబాహుళ్యంలోనూ ఎలైట్ లోనూ నా ఇమేజ్ నిలబెట్టు కోవాలిగదా! ఇన్నాళ్ళబట్టి కష్టపడి చాకచక్యంగా ఎంతో సాహసంగాను ధైర్యంగానూ, హుందాగానూ, ధీమాగానూ, పెంచుకుంటూ వస్తున్న, నాగౌరవ ప్రతిష్ఠలను ఒక్కసారిగా తుడిచివేసే పని చేస్తానా ! ఇమ్పాజిబిల్ ! అర్థంచేసుకోవాలి. ప్రతిదీ నేను చెపుతూ కూర్చోవాలంటే యెట్లా ! మీ ఆయన ఊరికే గొప్పలకు పోతాడుగాని, ఆ వాసుదేవరావు కొడుక్కిస్తే యేమయిందని, అని మా అత్తయ్య అంటుదా ! ఆనందరావు గారి కూతురు వాసుదేవరావు కోడలవుతుందా ! చస్తే ఆ సంబంధం చెయ్యను" అనందరావు ఉద్రేకపడ్డాడు. ఆయాస పడుతున్నాడు.

తాను యిప్పటికి సిటీలోనే కాక, చుట్టుప్రక్కల కూడా యెన్నో చోట్లకు వెళ్ళి, దేశం ఎదుర్కొంటున్న సమస్య లెన్నింటినో కూలంకషంగా చర్చించి ప్రజలను మెప్పించి, విజేత అయి తిరిగి వచ్చాడు. ఏ సభలో ప్రసంగించిన, ఏ ప్రదేశ మేగినా అనందరావుకు పొగడ్తలే, పొగడ్తలు. అసలు ఆయన వాగ్ధాటి ప్రజల్ని యిట్టే ఆకర్షింపజేస్తుంది. ఆయన ఉపన్యాసంలో, విద్యావంతులకు తర్కం సామాన్య ప్రజలకు ఊరడింపు కనిపిస్తుంది. నిరుద్యోగ సమస్య నిర్మూలనానికి బృహత్ప్రణాళికలను గురించి, తాను ఏకధాటిగా ఉపన్యసించిన దృశ్యం అనందిరావు కళ్ళలో యిట్టే మెరిసింది. ఒళ్ళుపులకరించింది. కుటుంబనియంత్రణ ఆవశ్యకత గురించి ఆయన గంభీరోపన్యాసం చేస్తున్నప్పుడు, సభలో ఒక ఆకతాయి లేచి అడిన ప్రశ్నకు, ఆయన యిచ్చిన సమాధానం పదే పదే జ్ఞాపకం వస్తోంది. ఆనందరావు పరవశుడైపోయినాడు. నిజంగా తాను అదివరకు జేసిన ఉపన్యాసాల యెత్తంతా ఒకటి, క్రిందటి వారం, విద్యార్థుల కర్తవ్యాన్ని గురించి ఉద్బోధించిన స్థాయి అంతా ఒకటి. మనిషికి కేవలం

తిండి, బట్టా, యిల్లేకాదు కావలసింది. ఐడియాస్ కావాలి. ఒక గొప్ప మంచి, బ్రైట్ ఐడియా, అసలు మానవుని దృక్పథాన్నే మార్చేస్తుంది. దానికోసం ప్రయత్నించాలి. ఆ రోజుల్లో గాంధీజీ, ఆలోచించి, ఆలోచించి క్విట్ ఇండియా అన్నాడు. అది యెంత విప్లవాన్ని లేవదీసింది. దేశ మంతా ఆ మాటతో ఉద్రిక్తమయిపోయింది. ఆనాడు తానుకూడా, ఒక రైలుస్టేషన్ దగ్గరకు వెళ్ళబోవటం, ఇంతలో పోలీసులు అమాంతం వెన కాలే వచ్చి పట్టుకుపోవటం, ఆనందరావుకు యిట్టే గుర్తుకువచ్చింది. అక్కడ ఆగిపోయాడు. ఇంక తన ఆలోచనా ప్రవాహానికి అడ్డువేసే శాడు. మనస్సు నిలిచిపోయింది. చుట్టూ లైట్లు బారులుతీర్చి, కాంతుల్ని వెదజల్లుతున్నాయి. తాను కూర్చున్నచోట మాత్రం చీకటిగానే వుంది. రిస్ట్ వాచ్ చూచుకున్నాడు. టైము సరిగా కనబడటం లేదు. లేచి కొంచె ముందుకు వెళ్ళి, దీపంవెలుతుర్లో టైము చూసుకొన్నాడు. తాను యిక్కడికివచ్చి చాలా సేపయిందనుకున్నాడు. ఇహ యింటికి బయలు దేరాలి. అనే ఆలోచన వచ్చింది. ఆ ఆలోచన రావటంతోనే, కాళ్ళూ చల్ల బడ్డాయి. ఇంట్లో దృశ్యం తనకళ్ళకు కట్టినట్లు కనిపిస్తోంది. అమ్మో అను కున్నాడు. కాని వెళ్ళక తప్పదు. తనయిల్లు, తనకోసం ఎదురుచూస్తూ వున్న భార్య, బిడ్డలు, అల్లుడురానీ, నాలుగూ కడిగిపెడతాను. అంటూ శపథం చేస్తున్న అత్తయ్య. ఆనందరావును వణికించేసినాయి. గజ గజ లాడిపోయాడు.

'మళ్ళీ రంగధామయ్యగారు మనిషిని పంపించారండీ...' అంటూ శారద మెల్లిగా అనటం, 'నాన్నా, రేపు జీతం కట్టకపోతే నా పేరు తీసే స్తారట' అని బాబు అనటం, 'అయ్యగారు రానీ ఆయన పనితేల్చేస్తా' అని వాకిటికి అడ్డంగా గౌరమ్మ 'కూర్చోవటం' ఆనందరావు నడుస్తున్నాడన్న మాటేగాని, ఇవన్నీ ఆయనకు దార్లో కనిపిస్తూనే వున్నాయి. అయితే

ఆనందరావు, యిలాంటి వాటికి భయపడి పారిపోయేవాడు కాడు. జీవితంలో యెన్నో ధైర్యంగా యెదుర్కొని రాజు కంటె బలవంతుడు అని అనిపించుకున్నవాడే. తల విదిలించేసుకున్నాడు, ధైర్యాన్ని పుంజుకున్నాడు. నిర్భయంగా నిశ్చలంగా ఆకాశం వంక ఒక్కసారి తేరపార చూశాడు. నక్షత్రాలు మిణుకు మిణుకు మంటూ ఆకాశం అంతా అల్లుకుని వున్నాయి. తన కాళ్ళక్రింద భూమి కదిలి పోతున్నట్లు అనిపించింది. చప్పున ఆగాడు. తన కళ్ళల్లో ఏదో తళుక్కుమంది. మనస్సులో ఏదో ఆలోచన మెరిసింది. పెదిమల మీదికి చిరువ్వు వచ్చినిలబడింది. కళ్లు పెద్ద వయినాయి. మొహం విప్పారింది. హృదయ భారం యిట్టే తీసేసి నట్టయింది. ఆనందరావుకు ఒక మంచి ఆలోచన తట్టింది. 'గరీబీ హటావ్' అంటూ మనస్సు బిగ్గరతా అరిచింది. ఆ అక్షరాలే ఆనందరావు నాలుక మీదకు వచ్చేసి నాయి. ఇప్పటి సమస్య యిది. దీన్ని మనం 'ఎక్స్ ప్లాయిట్' చెయ్యాలి అనుకున్నాడు. ఇందిరాగాంధీకి అమోఘంగా దేశమంతా జేజేలు పట్టించింది. యీ స్లోగనే! మనం దీన్ని ఉపయోగించు కోకపోతే, యిహ ప్రయోజనంలేదు. ధృఢంగా నిశ్చయానికి వచ్చేశాడు. తన యింటి పరిస్థితి, ఆ దృశ్యాన్నంతా యిట్టే కళ్లల్లోంచి తీసేశాడు. ఈ రాత్రి యింటికి వెళితే మాటదక్కదనుకున్నాడు. సరాసరి స్నేహితుడు సూర్యారా వింటికి బయలు దేరాడు. కాని ధైర్యం వచ్చినంత వేగంతోనే, పిరికితనంకూడా అతన్ని అవహించిది. వెనక్కు జంకాడు కాని కాలు ముందుకే సాగుతోంది. 'సూర్యారావు మంచివాడే. ఎప్పుడు తాను వచ్చినా చిరునవ్వుతో పలకరిస్తాడు. కాని ఆయన భార్య వసంత మాత్రం అదో తరహాగా వుంది. వాళ్లింటికి యెవరూ రావటం గిట్టదు. అయినా ఆమెగారి లెక్కేమిటి! నేను వెళుతోంది సరాసరి సూర్యారావు మొహం చూసేగా' అని తనలో తాను సమాధాన పడ్డాడు. సరాసరి సూర్యారావు యింటికి

వెళ్లేటప్పటికి, వసంత, గుమ్మం ముందు మిషను కుట్టుతూ కనిపించింది. ఆనందరావు గతుక్కుమన్నాడు. వసంత, తన పనిలో తాను వుండి పోయింది. ఆనందరావు ఒక్క క్షణం గుమ్మంముందు నిలబడి, 'సూర్యా రావు యింట్లో లేడా' అన్నాడు.

'ఇవ్వాళ ఓవర్ టైముందిటండీ. లేటుగా వస్తానని చెప్పారు ...' అన్నది వసంత మిషను నడిపిస్తూనే.

'అవును. సూర్యారావు అలాంటివాడే! ఎప్పుడూ పనిచేస్తూనే వుంటాడు. యంత్రానికి, అతనికి తేడాయేమిటి! రెక్కలు ఎప్పుడూ ఆడు తూనే వుంటాయి. ఆయన భార్యకూడా అంతే. ఏప్పుడు వాళ్ళింటికి వెళ్ళినా క్షణం తీరిగ్గా కూర్చున్నట్టు కనబడదు. ఏదో పనిచేస్తూనే వుంటుంది. వాళ్ళకు భగవంతుడు అంత ఓపిక పెట్టాడు ...' ఆనందరావు మనస్సు పూర్తిగా సామాధానపడనేలేదు. తల విదిలించు కున్నాడు.

తనమాదిరి, సూర్యారావు కూడా అంత రికామీగా యెందుకు వుండడు. చేతకాక. అసమర్థతవలన ... కాదు ... కాదు. నిజంగా సూర్యారావు ప్రొద్దస్తమానం చాకిరీ చెయ్యటం సరదాకా! తానుకూడా సూర్యారావు మాదిరి పనిచెయ్యలేడా! చెయ్యగలడు! మరెందుకు చెయ్యటం లేదు. నలుగురి నోళ్ళళ్ళల్లోనూ నిత్యమూ నలుగుతూ వుంటం యెందుకు! సమాధానం కనబడటంలేదు. సమాధానం వుంది. గొణుక్కుం టున్నాడు అనందరావు.

'శారదా నువ్వు చెప్పింది నిజమే. మనం ఒకాళ్ళ దయాదాక్షిణ్యాల మీద ఎల్లకాలం వుండలేము... మనల్ని గురించి మనం అనుకున్నట్టే, యితరులుకూడా అనుకోరు... కాని ... ఎన్నడూ యిలాంటి ఆలోచన్లు రాలేదే... ఇవ్వాళ ఎందుకింత బలహీనుణ్నయి పోతున్నాను! ... అర్థం

కావటంలేదు. ... నా స్నేహితులనుకునే వాళ్ళందరూ ఒక్కుమ్మడిగా కూడ బలుక్కుని, నన్ను కుంగదీసేద్దామను కుంటున్నట్టున్నారు... అది ఒక్కనాటికి సాగనీను ... కాకపోతే పద్మారావు... కాలేజీలో బాక్ బెంచీలో కూచుని, నలుగురిముందు గట్టిగా మాట్లాడటానికి హడలిపోయే పద్మారావు ... నన్ను పది మందిలో పట్టుకొని ఏం ఆనందరావు ఏం చేస్తున్నావ్? బి. కామ్. కంప్లీట్ చేశావా? అని అడుగుతాడా ! ఏమిటి వాడి ధైర్యం. నా ముందు వాడెంత ! పైగా ఫ్యాక్టరీలో ఫోర్‌మన్‌గా పనిచేస్తూ న్నానని సగర్వంగా ధీమాగా చెప్పుకుంటాడా ! నిజానికి గ్రాడ్యుయేట్ వర్కర్‌గా పనిచేస్తున్నందుకు సిగ్గుపడాలి ! ... కాని వాడి రోజది. ... ఏమిటో అర్థంకావటంలేదు. ... ఎందుకూ కొరగాని వాడని అనుకున్న గురుమూర్తి, యివ్వాళ నాకు నీతులు చెప్పడమా! ఇంతకీ అతని దగ్గరకు వెళ్ళి డబ్బు అడిగినందుకే గదా, అతనికి అంత ధీమావచ్చింది! అందులో అతని తప్పేమీలేదు. ఆనందరావు సమాధానపడ్డాడు.

చప్పున 'నాన్నా' అని కేకవినిపించినట్లు ఉలిక్కిపడ్డాడు. భవాని దీనంగా, తల్లిని చుట్టేసుకుని, వెక్కి వెక్కి ఏడుస్తున్న దృశ్యం, ఆనంది రావును చకితున్ని చేసింది.

'నాకు తెలీక అడుగుతాను మీరు కూడాఏదైనా ఉద్యోగంచేస్తే, ఏవండీ ! ...' అన్న శారద మాటలు, ఆనందరావు చెవుల్లో మారుమ్రోగి నాయి.

శారదా అని గట్టిగా అరిచి, ఆ ప్రశ్నకు సమాధానం చెప్పకుండా దాటేసినట్లుకూడా అతనికి గుర్తుకు వచ్చింది. మనస్సు కలవరపడిపోతోంది. గబగబ అడుగులు వేసుకుంటూ అక్కడి నుంచి ఎక్కడికైనా వెళ్ళిపోదా మని ప్రయత్నంచేస్తున్నాడు. బాగా అలసటగావుంది. కదల్లేకపోతున్నాడు. అయినా బలవంతంగా రెండుఅడుగులు ముందుకువేశాడు. ఇంకా కొంచెం

నడకసాగుతోంది. తన వెంట ఎవరో వస్తున్నట్లు అలికిడిగా వుంది. చప్పున వెనక్కు తిరిగాడు. ఎవ్వరూ కనిపించలేదు. కాని తననీడ మాత్రం పొడుగ్గానూ, తన వెంట వస్తూనేవుంది. చీకటి, వెలుతురు ఒకదాని వెంట ఒకటి, తనను వెంటాడు తున్నట్టున్నాయి. తన మనస్సు నిలకడగాలేదు. అతి చంచలంగావుంది. ఎటెటో పరుగెత్తుకొని పోతోంది.

నేనా, యింకా గురుమూర్తి దగ్గరకు వెళ్ళను. వాణ్ని అప్పడగటమా! వాడి బతుకెంత! వాడి తాహతెంత! నాలాంటి వాడు, అతని దగ్గరకు వెళ్ళట మంటేనే తలతీసేసి నట్లయింది. ఇంతకీ అతనొక ఉద్యోగస్థుడు. నలుగుర్లోనూ తలయెత్తుకుని తిరగ గలవాడు. అతని భార్యా బిడ్డలు, ఇల్లూవాకిలి, చూసిన వాళ్లెవ్వరూ కూడా అతన్ని ఆడిపోసుకోరు. ఆ అదృష్టం తనకులేదు.

అబ్బ! ఎంతబాధ. ఇతరులమీద ఆధారపడి ఉండటం ఎంతకష్టం! నేనెవరిని? నా విలువ యెంత! ఇహ నేను ఉపన్యాసాలు యివ్వలేను.... ఆనందరావు పూర్తిగా అలసిపోయాడు. ఒక క్షణం నిరిబడ్డాడోలేదో, అప్పుడే, ఓ బిచ్చగత్తె వచ్చి, అయ్యా కాస్త ధర్మంచెయ్యిబాబు. పొద్దున్నుంచి అన్నంలేదు... ఆకలి అవుతోంది. ...' అంటూ అతిదీనంగా అడుగుతోంది.

ఆనందరావు త్రుళ్ళిపడ్డాడు. శారద ఏడుపు వినిపించింది. బాబు ఘోష వినిపించింది. మనస్సు విలవిలలాడింది. తన మనస్సులో తళుక్కుమని మెరిసిన ఆలోచన, గరీబీహటావ్. దానిమీదే తాను ఉపన్యాసం యివ్వదలుచుకుంది కూడా. ఈ బీదరికం, చేత్తో తీస్తేపోయేదికాదు. ఉపన్యాసాలు ఇస్తే అంతకంటె పోదు. అసలు ఆ పేదరికం అనేది ఎక్కడుంది. ఆ గరీబీ ఎక్కడోలేదు. ఇక్కడే నాలోనే వుంది. నాఅజ్ఞానంలోవుంది.

నా సోమరితనంతో వుంది. నా అసమర్ధతలో వుంది. ... శారదా, నువ్వా నాడు వేసిన ప్రశ్నకు సమాధానం దొరికింది. నేనూ ఉద్యోగం చెయ్య గలను. నేనూ డబ్బు సంపాదించగలను. ఇదుగో వస్తున్నాను ...అంటూ ఆనందరావు గబగబ అడుగులు ముందుకు వేశాడు.